**1985 రక్తాక్షి సంక్రాంతి కథల పోటీలో కన్సొలేషన్ బహుమతి 116/- పొందిన కథ**

## పాపయ్య దుకాణంముందు జనం పోగవుతున్నారు.
### సాధారణంగా అక్కడే గారడీలు, దొమ్మరాటలు, తమాషాలు జరుగుతుంటాయి.

పాపయ్య పని కుర్రాడిని పిలిచాడు.
"సందడేమిటో కనుక్కో" అన్నాడు.



పనికుర్రాడు వెళ్ళిపోయాడు. మామూలుగా అక్కడ ఏది జరిగినా, ఆ ట్రూపు యజమాని, ముందు పాపయ్యను సమీపించి ఎదురుగుండా ఖాళీ స్థలంలో ఆట వేయడానికి అనుమతిపొంది, అతనిని చూడడానికి రమ్మని ప్రత్యేకంగా పిలుస్తాడు. అప్పుడు పాపయ్య పనివాడు ఒకచేయివిరిగిన కర్రకుర్చీ తెచ్చి ముందుగా వేస్తాడు. ఆట మొదలవుతుంటే పాపయ్య విచ్చేయడమో. లేక పోతే పాపయ్య వేంచేసేవరకు ఆట ఆపి అందరూ వేచి యుండటమో జరుగుతుంది.

వీటి అన్నిటికీ విరుద్ధంగా ఇవాళ ప్రొద్దున్నే ఆట మొద లవుతున్నది.

ఇంతకీ ఆ ఖాళీ జాగా పాపయ్యది కాదు. మునిసిపాలిటీ వాళ్ళది. దానిమీద ఏమి ఆడినా పాపయ్య అనుమతి అక్కర్లేదు. ఈ సంగతి పాపయ్యకి కూడా తెలుసు. కాని, పాపయ్యకు పెద్ద రికమిచ్చి. ముఖ్య అ తి థి గా ఆహ్వానిస్తే, నిరాటంకంగా ఆట సాగుతుంది. పాపయ్యను పొగిడితే మంచి బహుమతి కూడా ముడుతుంది.

ఈ విషయాలన్నీ ఈ కొత్త వాడికి తెలియవా? తెలియ కేం. వాడు ఆ ఖాళీస్థలంలో మూట దింపగానే ఒక దారినపోయే వాడు హెచ్చరిక చేశాడు— పాపయ్యగారితో సంప్రదించమని. కాని వాడు వింటేనా; విద్య చేతిలో వున్నవాడు ఎవరికీ తల వంచనక్కరలేదని జవాబు చెప్పాడు.

పని కుర్రాడు కనుక్కొని వచ్చాడు. అక్కడేదో సర్కస్ అవుతుందట. కుర్చీ వెయ్యమన్నది లేనిది అడిగాడు.

పాపయ్య క్షణం ఆలోచించాడు.

"ముందు మా అమ్మను దుకాణంమీద కూర్చోమను. తరువాత కుర్చీ పట్టుకొని పద." అన్నాడు పాపయ్య.

ముసలావిడను దుకాణం మీద కూర్చోబెట్టి, కుర్రాడు కుర్చీ పట్టుకొని ముందు నడిచాడు, పాపయ్య అనుసరించాడు.

కుర్రాడు కొంచెం ముందుకే కుర్చీ వేశాడు.

"ఇదేంటయ్యా? ఇక్కడ వున్న స్థలం చాలదని నేను ప్రజలను వెనక్కు తోస్తుంటే, మధ్యనొక కుర్చీ కూడానా!" అన్నాడు కోపంగా, ఒక నల్లటి, పొడుగాటి యువకుడు, ఆనాటి ఆటకు యజమాని.

"మా యజమానిగారు ఎప్పుడూ ఇక్కడే కూర్చుంటారు. నువ్వే ఇంకా కొంచెం ముందుకు పో!" అన్నాడు కుర్రాడు.

"అదేమీ కుదరదు. జనం తోసుకువస్తున్నారు. వెనక్కు పట్టుకుపో!"

కుర్రాడు పాపయ్యవేపు చూశాడు. పాపయ్య బదులు చెప్పలేదు. కుర్రాడు కుర్చీ కొంచెం వెనక్కు తీస్తే. పాపయ్య బుద్ధిగా వెళ్ళి కూర్చున్నాడు.

ఆ రోజు ప్రేక్షకులు హెచ్చుమంది చేరినా, తమాషాలో పాల్గొనేవారు ఎందరో లేరు. ఒక యువకుడు, ఒక కుక్క మాత్రమే.


ఆ యువకుడు తలమీద టోపీ పెట్టుకున్నాడు. ఉంగరాల జుత్తు వెనక్కు తోసుకున్నాడు. చెంపలమీదికి మీసం దువ్వు కున్నాడు. ఒక చేతిలో వున్న వేణువును ఊదుతూ. రెండవ చేతితో డమరు వాయిస్తున్నాడు. వేణువు నుంచి మంచి హిందీ ట్యూను శ్రావ్యంగా వినవస్తున్నది. ప్రజలందరూ కొంచెం

# చెప్పుతినేదు కుక్క

ఘండికోట బ్రహ్మాజీ రావు

నిశ్శబ్దం వహించిన తరువాత అతను మాట్లాడటం మొదలు పెట్టాడు.

"ప్రజలారా! ఈరోజు చిన్న సర్కస్ ఒకటి ఆడుతు న్నాము. దానికి హీరో ఎవరో అనుకోగలరు. వాడు సినిమా



హీరోకాదు. వాడు నా ప్రిన్స్ ఛార్మింగ్ నా రాజకుమారుడు— హలో! ప్రిన్స్!"

పక్కనే వెనక కాళ్ళమీద కూర్చున్న కుక్క లేచి తోక ఆడించింది.

"మా రాజకుమారుడికి ప్రొద్దున్న స్నానం చేయించిన తరువాత బట్టలు వేయడం మర్చిపోయాను."

సంచిలో నుండి ఒక మాసిన ముఖమల్ కోటును తీసి. కుక్కకు తొడిగి గుండీలు బిగించాడు అతడు.

"నా రాజకుమారుడిని సినిమాకంపెనీవాళ్ళు కొనుక్కుంటా మన్నారు. నేను ఒప్పుకోలేదు. సినిమాల్లోచేరితే చెడిపోతావురా ఆడవాళ్ళ వెంటపడతావురా అన్నాను. అవునా కాదా ప్రిన్స్?"

ఆ కుక్క అవునన్నట్లు తల ఊపింది. తోక ఆడించింది. చిన్నగా మూలిగింది.

"కరెక్టు! అది కుక్కభాషలో చెప్తున్నది. హీరోయిన్లు ముసలివాళ్ళయిపోయారు. చేరను అంటున్నది."

అందరూ నవ్వుతున్నారు.

పాపయ్య ముఖం మీద మాత్రం నవ్వు లేదు.

ఆ తమాషా చేస్తున్న పెద్దమనిషిని, వాడి కుక్క రాజ కుమారుడిని చాల కోపంతో చూస్తున్నాడు. వాడు వట్టి మాటల పోగులా కనిపించాడు.

"ప్రిన్స్! ఏదీ. ఈ కర్ర పట్టుకొని మార్నింగ్ వాక్ కి పోయి రా!"

ఆ కుక్క రెండు కాళ్ళ మీద నిలబడి. ముందు కాళ్ళతో కర్ర పట్టుకొని చుట్టూ తిరిగి వచ్చింది.

"ప్రజల్లారా! చప్పట్లుకొట్టండి. చప్పట్లు కొడితే ఉత్సాహం పుట్టుకొచ్చినా రాజకుమారుడు ఇంకా బాగా చేస్తాడు."

తరువాత మాసిన గుడ్డసంచి నుంచి డబ్బాల దస్తరం ఒకటి తీశాడు. పెద్ద డబ్బాలో చిన్నది, దానిలో మరో చిన్నది, మరో చిన్నది ఈ విధంగా ఎనిమిది డబ్బాలు అందులో ఉన్నాయి.

మొదట పెద్ద డబ్బా బోర్లించాడు. దాని మీదకి కుక్క



## ముండికోట బ్రహ్మాజీరావు

**1940** నుంచీ కథానికలు వ్రాస్తున్నా. చాలా కథానికలు పత్రికలలో ప్రకటింపబడినా "బహుమతికి నోచు కున్నవి రెండే కథానికలు - "ఇది కథ" అన్నదానికి రక్తాక్షి కథానికల పోటీలో "ఆంధ్ర సంఘం, కలకత్తా." మూడవ బహుమతిఇచ్చింది. తరువాత "ఆంధ్రజ్యోతి" సచిత్రవారపత్రికవారు కన్సొలేషన్ బహుమతి ఇచ్చి గౌరవించారు. నవలలు వ్రాసే రచయితగా "శ్రామిక శకటం". "విజయవాడ జంక్షన్"-వీటి ద్వారా మీ అందరికీ పరిచితుడనే-నవల వ్రాయకం కన్న మంచి కథానిక వ్రాయడం కష్టం. రెండు మూడు వందల నవలల్లో బహుమతి సంపాదించవచ్చు గాని. రెండు మూడువేల కథానికలలో బహుమతి సంపాదించడం కష్టం- "ఆంధ్రజ్యోతి" సచిత్ర వారపత్రిక ద్వారా ఆ గౌరవం దక్కింది. వారికి నా కృతజ్ఞతలు మరోసారి తెలుపుకుంటున్నాను.

ఎగిరి కూర్చుంది. దాని కన్నా చిన్న డబ్బా దానిమీద పెట్టాడు. దాని మీదికి కుక్క ఎగిరింది. ఆ విధంగా ఎనిమిదవ డబ్బా మీద చాలా నేర్పుతో కుక్క కూర్చుంది.

అందరూ చప్పట్లు చరిచారు.

నలుగురు కుర్రాళ్ళను పిలిచి మోకాళ్ళ మీద కూర్చో బెట్టాడు. పరుగులు తీస్తూ ఆ కుక్క వారందరి మీద నుంచి ఎగిరి దాటింది.

అతడు సంచిలోంచి రెండు ఇనుప రింగులు తీశాడు.

## నాటక రంగం

# శ్రీ జె.వి. సోమయాజులు

శ్రీకాకుళం జిల్లా, లుకులాంలో, అగ్రహారికుల వంశాన జన్మించిన శ్రీ జొన్నలగడ్డ వెంకట సోమయాజులు విజయనగరం, మహారాజ కళాశాలలో చదువుతూ, నాటక రంగానికొచ్చారు.

"హాస్టలు విద్యార్థులు మాత్రమే నాటకాలలో పాల్గొనాలి" అన్న నిబంధనకు వ్యతిరేకంగా శ్రీ వేదుల జగన్నాధరావు నాయకత్వంలో హాస్టలులోలేని విద్యార్థులు "శిధిల జీవి" నాటకం వేశారు. అలా వేసినవారిలో సోమయాజులు గారొకరు.

ఇంటర్ అవగానే శ్రీ జె.వి. రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో చేరారు. విజయనగరంలోనే, కవిరాజు మెమోరియల్ అసోసియేషన్ స్థాపించి నాటకాలాడటం ప్రారంభించారు. విజయనగరంలో జరిగే రాఘవ నాటక కళా పరిషత్ ఉత్సవాల్లో పాల్గొన్నారు. "దొంగాటకం"లో వేషానికి, సోమయాజులుగారు రాఘవ నాటక కళా పరిషత్ ఉత్సవాల్లో, ఉత్తమ నటుడిగా బహుమతి పొందారు. దాంతో శ్రీ జె.వి. పూర్తిగా నాటక రంగానికి అంకితమైనారు.

జె. వి. సోమయాజులుగారి తండ్రి శివరామమూర్తిగారు పౌరాణిక నటులు! శ్రీ జె.వి. తమ్ములు, శ్రీ రమణమూర్తి, శ్రీ శ్రీ రామమూర్తిగారలు నటులే! 1954లో శ్రీకాకుళం బదిలీ అయ్యాక, నటరాజ కళామండలి స్థాపించి, శ్రీకాకుళంలో నెలవారీ నాటక ప్రదర్శనలకు శ్రీకారం చుట్టారు. రంగస్థలాలు లేని కారణంగా, నాటక ప్రదర్శనలు, సినిమా హాలులో ఉదయం పూట ప్రదర్శించేవారు.

1955లో హైదరాబాదులో జరిగిన ఆంధ్ర నాటక కళా పరిషత్ పోటీల్లో, ఆనాటి ప్రముఖ నాటక సంస్థలూ ప్రముఖ నటులూ పాల్గొన్నారు. పోటా పోటీలుగా జరిగిన ఆ ఉత్సవాల్లో నటరాజ కళామండలి - శ్రీకాకుళం వారి "కాళరాత్రి" ఉత్తమ ప్రదర్శనకు ప్రథమ బహుమతి పొందింది.



1958 లో గుడివాడలో జరిగిన పరిషత్‌లో "పంజరం" నాటక ప్రదర్శించి ద్వితీయ ఉత్తమ ప్రదర్శనకు బహుమతి అందుకోనేగాక, శ్రీ జె. వి. ధరించిన పిచ్చివాడి పాత్రకు బహుమతి లభించింది.

1960 లో తణుకు ఆంధ్ర నాటక పరిషత్ లో "కుక్కపిల్ల దొరికింది" నాటికలో చిదంబరం వేషాధారణ ఉత్తమ పాత్రకు ప్రత్యేక నటుడిగా బహుమతి అందుకున్నారు శ్రీజె.వి.

ఉద్యోగపదవీ బాధ్యతలు ఎక్కువకావడంతో, 1960 తర్వాత సోమయాజులుగారు పోటీ నాటకాలనుంచి విరమించుకున్నారు. అంతమాత్రాన నాటకరంగం నుంచి దూరం కాలేదు. "కన్యాశుల్కం కీర్తిశేషులు కాళరాత్రి" నాటకాలు ప్రదర్శిస్తూనే వున్నారు.

"తెలుగు నాటక రంగాన్ని, కాంట్రాక్టర్లు నాశనం చేశారు" అనంటూ శ్రీజె. వి. సోమయాజులు నటులకు శాస్త్రీయమైన శిక్షణ అవసరం. అయితే అంతర్లీనంగా నటనాసక్తి, భావుకత లేనివాళ్ళు శిక్షణవల్ల నటులు కాలేరు" అనంటారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాంస్కృతిక వ్యవహారాల శాఖ సంచాలకులుగా పనిచేసి, పదవీ విరమణ చేసిన శ్రీ జె. వి. సోమయాజులుగారు, "మృచ్ఛకటిక" నాటకాన్ని నేటి సాంఘిక పరిస్థితులకు అనుగుణంగా, ఆంధ్రీకరించి ప్రయోగించాలని సంకల్పిస్తున్నారు. నటరాజు, వారి ఆశయం, ఆచరణలో వచ్చేందుకు తోడ్పడాలని ఆశిద్దాం.

శ్రీ జె. వి. "శంకరాభరణం" చిత్రంలో శంకర శాస్త్రిగా సుప్రసిద్ధులైనారు!

—తాదకరామారావు

మొదట వాటిని భూమికి కొంచెం ఎత్తులో ఉంచాడు. తరువాత వాటిని దూరంగా ఉంచాడు. కుక్క వాటిని దాటుతున్నది. ఎత్తి పట్టుకున్నాడు —ఎగిరి దాటింది.

కుక్కకు కొంచెం విశ్రాంతి ఇవ్వడానికి ఆ తమాషా చేసేవాడు-వేణువు ఊదుతూ, డమరుక వాయిస్తూ చుట్టూ తిరగడం మొదలుపెట్టాడు.


"నా ప్రజలారా! ఇది ఆఖరి ఫీటు. నా రాజకుమారుడు. నా ప్రిన్స్, ఇప్పుడు అగ్గిలోంచి దూకి రాజకుమారిని రక్షించబోతున్నాడు. సావధానంగా చూడండి." అంటూ పాపయ్య కుర్చీ వరకు వచ్చి ఆగిపోయాడు.

"మీరెవరో: అందరూ నిలబడి చూస్తుంటే కుర్చీ వేయించుకున్నారు. ఇలా మీరు అడ్డుపడుతుంటే నా ప్రిన్స్ ఎలా పరిగెడతాడు? కొంచెం పక్కకు తప్పుకోండి."

పాపయ్య చాల కోపంతో కుర్చీ వెనక్కు లాక్కున్నాడు.

"నా ప్రిన్స్‌ను చూడండి."

"చూడడానికేముంది! నా బొంద. ఊరకుక్కని తెచ్చి




ప్రిన్స్, ప్రిన్స్ అని తెగపొగుడుతున్నావు" అన్నాడు గట్టిగా పాపయ్య.

"ఇది ఊరకుక్కా?" ప్రశ్నించాడు తమాషాగా వాడు.

"కాక మరేమిటి! ఒకటీ మంచి లక్షణం లేదు."

"ప్రజలారా వినండి! మీరందరూ మా ప్రిన్స్ చేసిన పనులు చూశారు కదా! అయిదు సంవత్సరాలు కష్టాలుపడి ఈ ఆటలన్నీ నేర్పించాను. ఈయనగారెవరో దాన్ని ఊరకుక్క అంటున్నారు. ఇదేమైనా న్యాయంగా వుందా?"

"నువ్వు ఏం నేర్పేవో మానేవో, తిండి చాలక ఈ కుక్క ఎముకలు కనిపిస్తున్నాయి. అది సంపాదించినదంతా నువ్వు తింటే అదేం బలుస్తుంది?"

దానికి ఆ తమాషా చేసేవాడు పకాలున నవ్వాడు.

"అయ్యా, మీరెవరో —మీలా నా కుక్క బలిసివుంటే ఈ సన్నని రింగులలోంచి ఎలా దూరుతుంది?"

అందరూ గొల్లుమన్నారు. పాపయ్య నీరువిడిచిపోయాడు.

ఆ తమాషా ఆఖరి దశకు వచ్చింది. రింగులకు నూనె గుడ్డలు చుట్టి, నిప్పంటించి అతడు మీదకెత్తి పట్టుకుంటే, ఆ కుక్క చాలా నేర్పుతో వాటిలోంచి దూకి బయటపడింది.

అందరూ చప్పట్లు చరిచారు. ఈలలు వేశారు.

చివరకు కుక్క మెడలో ఒక బుట్టతగిలించాడు. అది వెనుక




"తరతరాలుగా మా కుటుంబంలో అందరం అయొడెక్స్‌నే నమ్ముకున్నాం..." అంటున్నారు గుమ్మడి.

నొప్పా? బెణికిందా? కండరాలు పట్టాయా? కీళ్ళు పట్టాయా? పీటన్నిటినీ నయం చేసేది అయొడెక్స్. నొప్పిని తగ్గించడం అన్నది అయొడెక్స్ యొక్క లక్షణం. అయొడెక్స్‌ని రుద్దుతుండగానే నొప్పి నుంచి ఉపశమనం కలుగుతుంది, లోపల, రుగ్మతగల పొరలు నయం కావడానికి మందంతా లోపలికి చొచ్చుకు పోయేందుకు అయొడెక్స్‌ని బాగా రుద్దండి. బాధ తగ్గినా కూడా అదే విధంగా అయొడెక్స్‌ని పదేపదే రాస్తూ వుండండి.

| | అయొడెక్స్ |
|---|---|
| ధాతువు (లోపలి పొర) దెబ్బతినడం | ✓ |
| నొప్పులు | ✓ |
| బెణకడం | ✓ |
| కీళ్ళు పట్టడం | ✓ |
| కండరాలు పట్టడం | ✓ |
| నడుం నొప్పి | ✓ |




అయొడెక్స్®
మిమ్మల్ని మళ్ళీ చురుకుగా పనిచేసేలా చేస్తుంది.

ELL-1568

పెద్దకథ
ఆపరేషన్ ఫాల్కన్
అల్లం శేషగిరి రావు



వచ్చేవారం నుండి
ప్రారంభం

కాళ్లతో నడుస్తూ. ప్రతీ ప్రేక్షకుడి ముందు నిలిచింది. చూసిన వాళ్ళు బుట్టలోకి డబ్బులు విసిరారు. దాని యజమాని వెంటనే నడుస్తూ డబ్బులు విసిరిన వాళ్ళకి సమస్కారాలు చేస్తున్నాడు.

ఆ కుక్క తిన్నగా పాపయ్య ఎదుట నిలబడింది. పాపయ్య జేబులోంచి పదిపైసల బిళ్ళతీసి బుట్టలో వేశాడు.

తమాషా చేసినవాడు ముందుకు వంగి. ఆ పది పైసల నాణాన్ని ఎత్తి అందరికీ చూపించాడు.

"అయ్యలారా! అందరూ ఈ పదిపైసల బిళ్ళని చూడండి- ఒక గంటసేపు నా ప్రిన్స్ ఛార్మింగ్, నా రాజకుమారుడు ప్రాణాలకు తెగించి సాహస కృత్యాలు చేసినందుకు ఈ కుర్చీలోని బాబుగారు ఇచ్చిన బహుమతి."

అందరూ చాలా నిశ్శబ్దంగా ఉన్నారు. అందరి కళ్ళు పాపయ్యవేపు తిరిగాయి.

పాపయ్యకు చాలా అవమానం జరిగింది.

ఆ నాణాన్ని ఆ తమాషా చేసినవాడు బుట్టలోవేసి, మిగిలిన వారి దగ్గిర డబ్బులు దండుకొని వెళ్ళిపోయాడు.

పాపయ్య దుకాణం ముందునున్న స్థలం ఖాళీ అయిపోయింది. కుర్రాడు వచ్చి కుర్చీ తీసుకొని పోయాడు.

పాపయ్య దుకాణం మీద కూర్చోలేదు. తిన్నగా ఇంట్లోకి వెళ్ళిపోయాడు. కోపంతో శరీరం కాలిపోతున్నది! వెళ్ళి వెళ్ళి పడకగదిలో మంచంమీద పడుకున్నాడు.

*　　　*　　　*

మధ్యాహ్నం రెండు గంటలవేళ అయింది. పాపయ్యకు భోజనం కూడా సరిగా సహించలేదు. పడకగదిలో మంచం మీద పడుకున్నాడు. కిటికీ తలుపులు తీశాడు. బైట కొంచెం దూరంలో కాలువ పక్కనున్న మర్రిచెట్టుక్రింద ఒకడు నిద్రపోతున్నాడు. అతని తల క్రింద మాసిన గుడ్డ సంచీ కనిపించింది.

పాపయ్య చాలా శ్రద్ధగా చూచాడు- వాడే- ఆ తమాషా చేసినవాడే వాడు. అయితే వాడి "కుక్క ఏమయింది? అక్కడికి మరో ఏభై గజాల దూరంలో ఒక నల్లకుక్క కనిపించింది. అది పళ్ళతో దేనినో పీకుతున్నది. చాలా సేపు ఆలోచిస్తూ చూశాడు పాపయ్య.

ఇంతలో సందు తలుపు చప్పుడయింది.

పాపయ్య మంచం దిగి, సందులో కెళ్ళి తలుపు తీసాడు.

ఆ వచ్చిన మనిషి కారు నలుపు. అతని కళ్ళు కెంపుల్లా మెరుస్తున్నాయి. మెడలో ఒక ఎర్ర రుమాలు చుట్టుకున్నాడు. బలిసిన భుజాల మీదికి చొక్కా చేతులు మడుచుకున్నాడు.

"పాపయ్య బాబూ! ఒక్క చుట్ట!"

"నారాయడూ! నీ బుద్ధి పోనిచ్చుకున్నావుకాదు. దుకాణం కట్టేసి అందరం నిద్రపోతుంటే నీకేమేనా బాగుందా?"

"నువ్విలా అంటావని తెలుసు! మరెక్కడా నాకు సుట్ట దొరకలేదు. సెప్పమంటావా నీ దుకాణంలో సుట్టతాగితే మరెక్కడా తాగాల ననిపించదు."

"ఏడిశావు!"

పాపయ్య ఇంట్లోకి వెళ్ళి వచ్చాడు. అతని చేతిలో ఒక లంక పొగాకు చుట్టల కట్ట, అగ్గిపెట్టి ఉన్నాయి,

నారాయడితో మాట్లాడుకూ పాపయ్య రెండడుగులు వేశాడు. తరువాత చుట్టల కట్ట, అగ్గిపెట్టె అతనికిచ్చి. వచ్చివేశాడు. సందు తలుపులు వేశాడు. పడకగదిలో కిటికీ తలుపులు మూసివేసి నిశ్చింతగా మంచంమీద పడుకొని నిద్రపోయాడు.

*　　　*　　　*

రోజూ పాపయ్య దుకాణం మూడు గంటలకే తెరుస్తాడు. ఇవాళ కొంచెం ఆలస్యమయింది తెరిచేసరికి.

పాపయ్య దుకాణంమీద కూర్చున్నాడు. మనిషి మంచి హుషారుగా ఉన్నాడు. అతడు హుషారుగా ఉన్నాడంటే. లోకానికి చాలా సౌమ్యంగా కనిపిస్తాడు. తొణకని నిండుకుండవలె ఉంటాడు, ఒక పొల్లు మాటైనా ఆడడు. మర్యాద తప్పడు.

దుకాణానికి ఒకరూ ఒకరూ వస్తున్నారు. క్రమంగా రద్దీ హెచ్చింది.

ఉన్నట్టుండి మనుషులను తోసుకుంటూ ఒక నల్లటి, పొడుగాటి మనిషి లోపలికి వచ్చాడు. అతడు చొక్కా వేసుకోలేదు. తొడుక్కున్న చంకల బనియను నిండా కన్నాలే. వాడి తలపైన టోపీ లేదు. తైల సంస్కారంలేని జుత్తు పీక్కోడంతో బుట్టలా పైకి లేచింది.

"బాబూ! నా కుక్క!"

అందరూ ఆ వచ్చిన మనిషివేపు తిరిగారు.

"ఎవరూ? నీ కుక్కా?" ప్రశ్నించాడు పాపయ్య.

"అవును బాబూ! నా కుక్కే."

పాపయ్య చాల శ్రద్ధతో దయతో మాట్లాడుతున్నాడు.

"ఏమయింది నీ కుక్క?"

"కనపడటం లేదు. అరగం[illegible] నుంచి వెదుకుతున్నాను"


"అంటే. సర్కస్ చేసిన కుక్క. నల్ల గా వుంటుందీ...."

"అదేను బాబూ!"

"ఏమయింది?"

"మధ్యాహ్నం తిండిపెట్టి. గొలుసు కట్టువిప్పి దానిని వదిలేశాను. మర్రిచెట్టుకింద ఒక క్షణం నడుంవాల్చి పిలిస్తే అది రాలేదు. వెతికితే కనిపించలేదు. ఎవరేనా చూచారా?"

"ఒరే వెంకట్రాముడూ? ముఖమల్ కోటు తొడుక్కున్న కుక్కరా అది. నువ్వు చూస్తే చెప్పరా! ఈ అబ్బాయి చాలా గొప్ప సర్కస్ మేనేజరురా!" అన్నాడు పాపయ్య ఒక కుర్రాడివేపు చూస్తూ.




"నాకు కోటు తొడుక్కున్న కుక్క ఏదీ కనిపించలేదు. మధ్యాహ్నం మేము ఆడుకుంటుంటే కాలువ గట్టున ఒక నల్ల కుక్క కనిపించింది. పాత చెప్పు నొకదాన్ని అది కొరుకుతున్నది."

"నా కుక్క మామూలు కుక్క కాదు. నాకు ప్రాణ స్నేహితుడు. విశ్వాసమున్న బంటు. అది కుక్క కాదు. నాకు రోజూ అన్నం పెడుతున్న దేవుడు. అది అటువంటి పని చేయదు" ఏడుస్తూ అన్నాడు తమాషా చేసినవాడు.

"వెంకట్రాముడూ! ఈ సర్కస్ మానేజరుగారి కుక్క ప్రిన్స్ ఛార్మింగ్‌రా! రాజకుమారుడురా! రాజావారి పనులే చేస్తుంది. చెప్పులు కొరకదు."

"అదేమో మరి! ఆ నల్లకుక్క తోకమీద తెల్లని పెద్ద మచ్చ వుంది." అన్నాడు వెంకట్రాముడు.

"అదేను బాబూ! అదే నా కుక్క- ఏమయిందో చెప్పు బాబూ!"

"అదే అయితే సరిగా విను- కుక్కలు పట్టే నారాయుడు దీని మెడలోకి తాడు విసిరి పట్టుకున్నాడు. అది అల్లరి పెడుతుంటే దుడ్డుకర్రతో తలమీద మోది. కుక్కలబండిలోకి ఎక్కించాడు- పోయి వెతుక్కో!"

"నా ప్రిన్స్! నా రాజా!"- ఆ మనిషి అరుచుకుంటూ వెనుకకు తిరిగి పరుగెత్తాడు.

పాపయ్య ముఖంలో ఏమీ మార్పులేదు. అతను సౌమ్యంగానే వున్నాడు. చుట్టూ ఉన్నవాళ్ళందరి ముఖాలలోను జాలి కనిపించింది.

"పాపం! ప్రిన్స్ ఛార్మింగ్. రాజకుమారుడు పోయాడు" అన్నాడు యాదాలాపంగా పాపయ్య. ●

